# శ్రీ సాయి రక్షా వ్రతం

సాక్షాత్తూ శ్రీ సాయినాథునిచే అనుగ్రహింపబడిన అద్భుత వ్రతకల్పము



తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి



ఓం ఆత్మరూపాయ విద్మహే
యోగిరాజాయ ధీమహి తన్నో సాయి ప్రచోదయాత్

శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు

# శ్రీ సాయి రక్షా వ్రతం

## శ్రీ సాయినాథునిచే అనుగ్రహింపబడిన అద్భుత వ్రతకల్పము



తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి, M.Tech

श्रीं

**శ్రీ డిజైన్స్**

**VEDIC LOGO DESIGNERS**

**www.lordofsevenhills.com**

**Phone : 040 - 23833752**

**హైదరాబాదు**

**2014**

# శ్రీ సాయి రక్షా వ్రతం

**శ్రీ సాయినాథునిచే అనుగ్రహింపబడిన అద్భుత వ్రతకల్పము**

**తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి**

© సర్వహక్కులు రచయితవి.

First Edition : 2014

**వెల : అమూల్యం**

**కాపీలకు**
**"Viswapathi"**
**T.V.R.K. MURTHY, M.Tech**
Flat No. 202, Plot No. 32,
Srikar's Ravi Residency,
Beside Nalanda High School,
Near Motinagar 'X' Roads,
HYDERABAD - 500 018, India.
Ph : 040 - 23833752.
Cell : 98494 43752
Website : www.lordofsevenhills.com
Email: viswapathi@yahoo.com
shridesigns@gmail.com

Designed & Printed at :
**SRI VASAVI PRINTERS,**
1A, 1st Floor, Ameepet,
Hyderabad. 9989277178.

# నివేదన

ప్రత్యక్షదైవం ప్రతిబంధనాశనమ్ సత్యరూపం సకలార్తినాశనమ్
సౌఖ్యప్రదం శాంత మనోజ్ఞనరూపమ్ సాయినాథమ్ సద్గురుం చరణం నమామి

అతిపవిత్రమైన షిరిడీ పుణ్యక్షేత్రంలో తనను నమ్మిన భక్తులను నిత్యం కాపాడడానికై వెలసిన సాయినాథుడు అమృతమూర్తి. సాయిని నిత్యం కొలచేవారికి ఎటువంటి ఆపదలూ కలుగవు. తలపెట్టిన అన్ని పనులలోను జయం కలుగుతుంది. జీవితం సాఫీగా, శుభప్రదంగా గడుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది భక్తులు ఆ సాయినాథుని నిత్యం కొలుస్తూ ఆ స్వామి అనుగ్రహంతో సుఖంగా జీవిస్తున్నారు.

1983లో రీజనల్ ఇంజనీరింగ్ కాలేజి, వరంగల్ నుండి ఎం.టెక్. చదివిన నేను 1984 దాకా ఆల్విన్‌లోనూ, 1989 దాకా ఎం.వి.ఎస్.ఆర్. ఇంజనీరింగ్ కాలేజిలోనూ ఉద్యోగం చేశాను. 1983లో చి॥సౌ॥ వేంకట రుక్మిణి వైదేహితో వివాహం. ముగ్గురు పిల్లలు, ఆనంది, ఆముక్త, ఆదిత్యలు.

1998 నుంచి బిజినెస్ సంస్థలకు వేదశాస్త్రాలు, జ్యోతిష్య శాస్త్రం ఆధారంగా పేర్లు నిర్ణయించటం, లోగోలు డిజైన్ చేయడంలో నిమగ్నమై ఉన్నాను. ఇప్పటిదాకా నేను లోగోలు డిజైన్ చేసిన 5,000 పైగా సంస్థలు దేశ, విదేశాలలో ప్రముఖ స్థానంలో ఉన్నాయంటే అదంతా ఆ శ్రీనివాసుని అనుగ్రహం తప్ప మరొకటి కాదు.

ఆ శ్రీనివాసుని దయవలన నేను ఇప్పటిదాకా ఆ స్వామి లీలలపై పదహారు పుస్తకాలు రచించడం జరిగింది. ఆ పుస్తకాలన్నీ దేశ విదేశాలలోని భక్తులచేత నిత్యం పఠింపబడటం ఆ స్వామి అనుగ్రహం తప్ప మరొకటి కాదు. ఈ పుస్తకాలు చదివిన ప్రతి వారికీ ఎన్నో శుభాలు జరుగుతున్నాయి. ఆ శ్రీనివాసుని అనుగ్రహంతో వీరందరూ ఎంతో సుఖంగా జీవిస్తున్నారు. ఈ రచనలన్నిటిలో శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పం, శ్రీ లక్ష్మీ నరసింహ వ్రతకల్పం, శ్రీ ఆనంద ఆంజనేయం, శ్రీ మహేశ్వర వ్రతం, శ్రీ సుబ్రహ్మణ్య వ్రతం భక్తులను ఎంతగానో అలరిస్తున్నాయి. ఈ అయిదు వ్రతాలు నిత్యం ఎందరో భక్తుల గృహాలలోను, ఎన్నో ఆలయాలలోను ఆచరింపబడుతున్నాయి. ఇంతకు మించిన భాగ్యం ఏముంటుంది?

ఎప్పటినుంచో సాయినాథుని భక్తులు అనేకమంది నన్ను సాయివ్రతం రచించవలసిందిగా అడుగుతున్నారు. కానీ ఆ భగవంతుని సంబంధించిన ఏ పుస్తకానికైనా ఆ దేవత కరుణ కలిగేదాకా వ్రాయటం కుదరదని నా నమ్మకం. నేను రచించిన ప్రతి పుస్తకం వెనుక ఈ విషయం ప్రత్యక్షంగా అనుభవించాను. ఇన్ని రోజులకు ఆ సాయినాథుని

కృపతో ఈ పుస్తకం రచించడం జరిగింది. ఈ సాయిరక్షా వ్రతం రాసే ముందు రోజులలో ఎన్నో అద్భుతాలు గమనించాను. వరుసగా అయిదు రోజులపాటు సాయినాథుని భక్తులు ఎవరో ఒకరు రావడం, సాయినాథునిపై పుస్తకం ఎప్పుడు రచిస్తున్నారని అడగడం జరిగింది. అంతే! అటు తరువాత రెండు రోజులకే ఈ సాయిరక్షావ్రతం రచించడం జరిగింది. ఈ పుస్తకం రాస్తున్నంతసేపు ఆ సాయినాథుడే నాచే రాయిస్తున్న అనుభూతి కలిగింది. కంటికి ముందు ఈ సంఘటనలన్నీ కనపడసాగాయి. అవే ఈవిధంగా వ్రతకథల రూపంలో అక్షర రూపం దాల్చాయి. ప్రతీ అక్షరం ఆ సాయినాథుని అనుగ్రహం తప్ప మరొక్కటి కాదు. ఈ వ్రతం ఆచరించిన ప్రతీ వారికి ఆ సాయినాథుని అనుగ్రహం తప్పక కలుగుతుందని నా నమ్మకం.

సాయినాథుడు ఎంతో ప్రేమమూర్తి. మనకున్న కష్టనష్టాలు, మన పరిమితులు, అన్నీ ఆ స్వామికి తెలుసు. అందుకే ఆర్తులను ఆదుకొనడానికి ఇంత తేలికైన వ్రత విధానాన్ని మనకు అనుగ్రహించాడు. ఎవరైనా, ఎప్పుడైనా ఎంతో తేలికగా ఆచరించే వ్రతవిధానాన్ని మనకు అనుగ్రహించాడు. మనందరిపై తన అపార కరుణాకటాక్షాలను కురిపించడానికే ఆ సాయినాథుడు ఇంతటి తేలిక వ్రతవిధానాన్ని అనుగ్రహించాడని నా నమ్మకం.

ఈ పుస్తకాన్ని చక్కగా డి.టి.పి. చేయించి అచ్చు వేయించిన శ్రీ వాసవీ ప్రింటర్స్ శ్రీమతి & శ్రీ పి.జగదీష్‌కు ఆ శ్రీసాయినాథుని అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను. ఈ పుస్తక ప్రథమ ముద్రణకి సహకరించిన ఎంతోమందికి నా కృతజ్ఞతలు. ముఖ్యంగా నా సోదరుడు శ్రీమతి & శ్రీ తిమ్మరాజు రామ్మోహన్ దంపతులకు ఎన్నో కృతజ్ఞతలు. ఇదంతా కూడా కేవలం స్వామివారి ప్రేరణ అనుకుంటున్నాను. వీరికి, వీరి కుటుంబ సభ్యులందరికి ఆ సాయినాథుని అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను.

ఈ పుస్తక రచనకు ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ వ్రతకల్పం ఆచరించిన మీకు, వ్రత కథలు విన్నవారికి, ప్రసాదం స్వీకరించినవారికి సకల ఆయురారోగ్య సౌభాగ్యాలు కలగాలని ఆ శ్రీ సాయినాథుని ప్రార్థిస్తున్నాను.

సర్వేజనా సుఖినోభవంతు ః

**శ్రీ సాయినాథ కటాక్ష సిద్ధిరస్తు**

**సమస్త సన్మంగాళానిభవంతు ః**

**తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి**

Hyderabad
2014

viswapathi@yahoo.com
shridesigns@gmail.com
Ph : 9849443752

# ఈ వ్రతం ఎలా ఆచరించాలి?

- ఈ పుస్తకాన్ని ఎవ్వరైనా, ఎప్పుడైనా, వయసుతోగానీ, కులంతోగానీ నిమిత్తం లేకుండా పఠించవచ్చును. స్త్రీ, పురుష భేదం లేదు, ఏ నెలలోనైనా, ఏ రోజులలోనైనా చదువవచ్చును. ఏకాదశి, పౌర్ణమి తిథులందు పఠిస్తే మరింత శుభప్రదం. గురువారంనాడు చదివితే చాలా మంచిది. జన్మజన్మల పాపాలు నశిస్తాయి. ఎంతో పుణ్యఫలం కలుగుతుంది. ఈ వ్రతం ఆచరించే రోజున ఉపవాసం తప్పక ఉండాలనే నియమం లేదు.

- ఈ వ్రతం ఆచరించేముందు ఒక్కసారి మనస్సులోనే గణపతికి, నవగ్రహదేవతలకు, అష్టదిక్పాలకులకు నమస్కరించవలెను. అటుతరువాత మీ పేరు, మీ కుటుంబ సభ్యుల పేర్లు, గోత్రం మనస్సులో తలచుకొని వ్రతం మొదలుపెట్టవలెను. శ్రీ సాయినాథుని అష్టోత్తర నామాలు పఠించాలి. శ్రీ స్వామివారి అథాంగపూజ చేసి తరువాత ఈ పుస్తకంలోని ఐదు కథలను చదివి స్వామివారికి ఏ ఫలమునైనా నివేదింపవచ్చును.

- ఈ వ్రతం ఆచరించేటప్పుడు భార్య, భర్తలు ఇద్దరూ తప్పక కలిసి ఆచరించాలనే నియమం లేదు. భర్తకు వీలున్నప్పుడు భర్త, భార్యకు వీలున్నప్పుడు భార్య, ఇలా ఎవరి వీలును బట్టి వారు ఆచరించవచ్చును. వీలున్నప్పుడు ఇద్దరూ కలిసి ఆచరింపవచ్చును.

- దురదృష్టవశాత్తు భార్యను కోల్పోయిన పురుషులు కానీ, భర్తను కోల్పోయిన స్త్రీలు కాని కూడా నిరభ్యంతరంగా ఈ వ్రతం ఆచరింపవచ్చును. ఈ వ్రతం ఆచరించినవారికి పూర్తి మనశ్శాంతి కలుగుతుంది.

- ప్రతి గురువారం ఈ పుస్తకంలోని ఐదు కథలను చదివి స్వామికి అరటిపండ్లనుగానీ, జామపండ్లను గానీ నైవేద్యం పెట్టి స్వీకరిస్తే ఎటువంటి అనారోగ్యమైనా వెంటనే తొలగిపోతుంది. ఎటువంటి ఆపదలూ కలుగవు, అపమృత్యుభయం ఉండదు. చదివే శక్తిలేనివారికి, వారి బంధువులెవరైనా చదివి వినిపించినా, ఎంతో ఫలం కలుగుతుంది.

- ప్రతీ గురువారం సాయినాథుని ఆలయంలో అర్చకులచేత ఈ పుస్తకం పఠించబడితే ఆ ఆలయాలు మహా మహిమాన్వితమైన దివ్యక్షేత్రాలుగా పేరొందుతాయి. అక్కడకు వచ్చే భక్తులందరికీ సాయినాథుని అనుగ్రహం కలిగి సుఖశాంతులతో జీవిస్తారు.

⇨ శ్రీ సాయినాథుని దివ్యక్షేత్రమైన షిరిడీలో కానీ, ఏ ఇతర పుణ్యక్షేత్రాలలో కానీ ఈ వ్రతం ఆచరిస్తే కొన్ని కోట్ల జన్మల పాపఫలం నశిస్తుంది. వ్రతం ఆచరించిన వెంటనే శరీరంలోని రోగాలన్నీ తొలగిపోతాయి. శరీరానికి నూతన తేజస్సు కలుగుతుంది. దీర్ఘాయుష్షుతో కలకాలం సుఖంగా జీవిస్తారు.

⇨ సంతానం లేనివారు సాయినాథుని ఆలయంలో గురువారం ఈ పుస్తకం పఠిస్తే తప్పక చక్కటి సంతానం కలుగుతుంది. వివాహం కాని కన్యలు కానీ, యువకులు కానీ, ఈ విధంగా చదివితే త్వరలో వివాహం జరుగుతుంది.

⇨ దూరదేశాలలో ఉండే మీ పిల్లల నిమిత్తం, మీ బంధువుల నిమిత్తం మీరు కూడా చదువవచ్చును. వారికి సంతానం, వివాహం, ఉద్యోగం, ఆరోగ్యం కొరకు ఈ పుస్తకాన్ని గురువారం నాడు సాయినాథుని ఏ ఆలయంలోనైనా చదివితే వెంటనే ఫలితం కలుగుతుంది.

**మరొక్క ముఖ్య విషయం ఏమంటే సాయినాథునికి తన భక్తులెంటో ఎంతో అభిమానం. ఎంతో ప్రేమ. మీ అందరినీ తన స్వంత బిడ్డలవలె తలుస్తాడు. మీ యోగక్షేమాలు తానెప్పుడూ గమనిస్తుంటాడు. ఈ వ్రతం ప్రశాంత మనస్సుతో ఆచరిస్తే వ్రతం పూర్తికాగానే ఆ సాయినాథుడు ఏదో ఒక రూపంలో మీ ఇంటికి వచ్చి తాను కూడా ప్రసాదం స్వీకరిస్తాడు. మీకు తెలిసిన బంధువుల రూపంలోనో లేదో ఏదైనా అపరిచిత వ్యక్తి రూపంలోనో లేకపోతే కుక్కగానో, పిల్లిగానో, ఏ క్రిమికీటకాల రూపంలోనో, పక్షి రూపంలోనో ఇలా ఏదో ఒకరూపంలో వచ్చి ప్రసాదం తప్పక స్వీకరిస్తాడు. ఎంతో ప్రశాంత మనస్సుతో ఆ సాయినాథునే స్మరిస్తూ వ్రతం చేసినవారింటికి తాను తప్పక వచ్చి ప్రసాదం స్వీకరిస్తాడు. ఈవిషయం సాక్షాత్తూ ఆ సాయినాథుడే సెలవిచ్చాడు.**

ఈ విధంగా ఏ రీతిలోనైనా, ఏ రోజైనా, ఈ పుస్తకం పఠించి సాయినాథుని అనుగ్రహం పొందవచ్చు.

– తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

Hyderabad
2014

viswapathi@yahoo.com
shridesigns@gmail.com
Ph : 9849443752

# శ్రీ సాయిబాబా అష్టోత్తర శతనామావళిః

ప్రతి నామమునకు ముందు 'ఓం' అనియు చివర 'నమః' అనియు పూజించవలెను.

శ్రీ సాయినాథాయ
లక్ష్మీనారాయణాయ
కృష్ణరామశివమారుత్యాది
రూపాయ
శేషసాయినే
గోదావరీతట షిర్డివాసినే
భక్తహృదయాలయాయ
సర్వహృద్వాసినే
భూతవాసాయ
భూతభవిష్యద్భావవర్జితాయ
కాలాతీతాయ
కాలాయ
కాలకాలాయ
కాలదర్పదమనాయ
మృత్యుంజయాయ
అమర్త్యాయ
మర్త్యాభయప్రదాయ
జీవాధారాయ
సర్వాధారాయ
భక్తావనసమర్థాయ
భక్తావనప్రతిజ్ఞాయ
అన్నవస్త్రదాయ
ఆరోగ్యక్షేమదాయ
ధనమాంగల్యప్రదాయ
బుద్ధిసిద్ధిప్రదాయ
పుత్రమిత్రకళత్ర
బంధుదాయ
యోగక్షేమ వహాయ
ఆపద్బాంధవాయ
మార్గబంధవే
భుక్తిముక్తిస్వర్గాపవర్గదాయ
ప్రియాయ
ప్రీతివర్ధనాయ
అంతర్యామినే
సచ్చిదాత్మనే
నిత్యానందాయ
పరమ సుఖదాయ
పరమేశ్వరాయ
పరబ్రహ్మణే
పరమాత్మనే
జ్ఞానస్వరూపిణే
జగతః పిత్రే
భక్తానాంమాతృధాతృ
పితామహాయ
భక్తాభయప్రదాయ
భక్తవత్సలాయ
భక్తానుగ్రహకారకాయ
శరణాగతవత్సలాయ
భక్తిశక్తిప్రదాయ
జ్ఞానవైరాగ్యదాయ
ప్రేమప్రదాయ
సంక్షయహృదయదౌర్బల్యపాపకర్మ
వాసనాక్షయకారకాయ
హృదయగ్రంధిబేధకాయ
కర్మధ్వంసినే
శుద్ధ సత్వస్థితాయ
గుణాతీత గుణాత్మనే
అనంతకళ్యాణగుణాయ
అమితపరాక్రమాయ
జయనే
దుర్ధరాక్షోభ్యాయ
అపరాజితాయ
త్రిలోకేషాధిపతయే
అసక్యరహితాయ
సర్వశక్తిమూర్తయే
సురూప సుందరాయ
సులోచనాయ
బహురూపవిశ్వమూర్తయే
అరూప వ్యక్తాయ
అచింత్యాయ
సూక్ష్మాయ
సర్వాంతర్యామి
మనోవాగతీతాయ
ప్రేమమూర్తయే
సులభదుర్లభాయ
అసహాయ సహాయాయ
అనాథనాథదీనబాంధవే
సర్వభారభృతే
అకర్మానేకర్మసుకర్మణే
పుణ్యశ్రవణకీర్తనాయ
తీర్థాయ
వాసుదేవాయ
సతాంగతయే
సత్పరాయణాయ
లోకనాథాయ
పావనానఘాయ
అమృతాంశవే
భాస్కర ప్రభాయ
బ్రహ్మచర్యతపశ్చర్యాది
సువ్రతాయ
సత్యధర్మపరాయణాయ
సిద్దేశ్వరాయ
సిద్ధసంకల్పాయ
యోగీశ్వరాయ
భగవతే
భక్తవశ్యాయ
సత్పురుషాయ
పురుషోత్తమాయ
సత్యతత్వబోధకాయ
కామాదిషడ్వైరిధ్వంసినే
అభేదానందానుభవప్రదాయ
సర్వమతసమ్మతాయ
దక్షిణామూర్తయే
శ్రీవేంకటేశరమణాయ
అద్భుతానంతచర్యాయ
ప్రసన్నార్తిహారాయ
సంసారసర్వదుఃఖ క్షరాయ
సర్వవిత్సర్వతో ముఖాయ
సర్వాంతర్భస్థితాయ
సర్వమంగళకరాయ
సర్వాభీష్టప్రదాయ
సమరసన్మార్గస్థాపనాయ
సమర్థసద్గురుసాయినాథాయ

**శ్రీ షిర్డీసాయి అష్టోత్తర శతనామావళిః సమాప్తము**

# అధాంగపూజ

| | |
|---|---|
| ఓం తీర్థపాదాయ నమః | పాదౌ పూజయామి. |
| ఓం బలాయ నమః | జంఘే పూజయామి. |
| ఓం ఆధారభూతాయ నమః | జానునీ పూజయామి. |
| ఓం విశ్వప్రపూజితాయ నమః | ఊరూ పూజయామి. |
| ఓం జితేంద్రియాయ నమః | గుహ్యం పూజయామి. |
| ఓం స్థిత ప్రజ్ఞాయ నమః | కటిం పూజయామి. |
| ఓం మితాశనాయ నమః | ఉదరం పూజయామి. |
| ఓం విశాల వక్షసే నమః | వక్షస్థలం పూజయామి. |
| ఓం శుద్ధహృదయాయ నమః | హృదయం పూజయామి. |
| ఓం శిష్య వత్సలాయ నమః | స్కంధౌ పూజయామి. |
| ఓం ఆత్మోద్ధారకాయ నమః | భుజౌ పూజయామి. |
| ఓం దానహస్తాయ నమః | హస్తౌ పూజయామి. |
| ఓం కంబుకంఠాయ నమః | కంఠం పూజయామి. |
| ఓం ప్రసన్న వదనాయ నమః | ముఖం పూజయామి. |
| ఓం మృదుభాషణాయ నమః | జిహ్వాం పూజయామి. |
| ఓం కరుణా నిధయే నమః | నేత్రే పూజయామి. |
| ఓం శాస్త్రానుసారిణే నమః | శిరః పూజయామి. |
| ఓం సర్వజ్ఞాయ నమః | సర్వాణ్యంగాని పూజయామి. |

# శ్రీ సాయిరక్షా వ్రతం

## మొదటి అధ్యాయం

### విశ్వనాథరావు కథ

పూర్వకాలంలో అహ్మద్‌నగర్‌కు నలభై మైళ్ళదూరంలో ఒక చిన్న పల్లెటూరు ఉండేది. ఆ ఊరిలో విశ్వనాథరావు అనే చెప్పులు కుట్టేవాడు ఉండేవాడు. అతడు ఒక పూరిపాకలో నివసిస్తూ ఆ ఊరి మధ్యలోగల కరెంటు స్థంభం కింద పగలంతా కూర్చుని చెప్పులు కుడుతుండేవాడు. భార్య, ఇద్దరు ఆడపిల్లలతో సంసార భారం మోయడం కష్టంగా ఉండేది. వచ్చే కొంత డబ్బుతోనే జీవితం సాగిస్తూ ఉండేవాడు. ఒకరోజు పని దొరికి, మరొకరోజు దొరకక జీవితం గడుస్తుండేది.

విశ్వనాథరావుకి సాయినాథుడంటే ఎంతో భక్తి. ప్రతీనిత్యం ఆ సాయినే తలుస్తుండేవాడు. ఏ పనిలో ఉన్నా సాయినామ స్మరణలోనే గడిపేవాడు. ఎప్పటికైనా తాను నమ్మిన సాయిదేవుడు తనను ఈ బాధలనుండి బయటపడవేస్తాడని తలచేవాడు. ప్రతిరోజు తన ఇంట్లో ఉన్న చిన్న సాయినాథుని పటానికి నమస్కరించి ఆ పటాన్ని చేతిలో తీసుకుని ఉదయం పదిగంటలకల్లా ఆ కరెంటు స్తంభం వద్దకు చేరుకునేవాడు. ఆ స్తంభానికి సాయినాథుని ఫోటోను వేలాడదీసి దానికిందనే స్తంభానికి ఆనుకుని కూర్చుండేవాడు. చెప్పులు కుట్టుకోవడానికి కావలసిన సామానంతా ఒక పాత సంచిలో వేసుకుని భుజానికి తగిలించుకుని వచ్చేవాడు. సాయంత్రం ఆరు గంటలవరకు అక్కడే ఉండి తిరిగి సామానంతా ఆ సంచిలోనే పెట్టుకుని సాయినాథుని ఫోటోను కళ్ళకు అద్దుకుని, చంకలో పెట్టుకుని తిరిగి ఇంటికి చేరేవాడు.

ఈ విధంగా అతడి దినచర్య గడిచేది. ప్రతిరోజు వచ్చిన డబ్బుతో ఇంటికి వెళుతూ కావలసిన సరుకులుకొని తీసుకువెళ్ళేవాడు. తాను చేసే పనికి ఎవరినీ ఇంత ఇమ్మని గట్టిగా అడిగేవాడు కాదు, వాళ్లు ఇచ్చినదే కళ్ళకు అద్దుకుని తీసుకునేవాడు. రోజులు ఇలా గడుస్తుండగా ఒకనాడు తన పని చేసుకుంటూ ఉండగా ప్రభుత్వం వారి చాటింపు వినపడింది. పేదవారికోసం ప్రభుత్వం ఉచితంగా ఇళ్ళు నిర్మించి ఇస్తుందని, కావలసినవారు రాబోయే నెల ఒకటవతారీకు లోపు తమ పేరు, వివరాలు నమోదు చేసుకోవాలని దాని సారాంశం. ఇది విన్న విశ్వనాథరావు ఎంతో సంతోషపడ్డాడు. ఆ సాయినాథుని దయవలన తనకు ఒక చిన్నపాటి ఇల్లయినా లభిస్తే బాగుంటుందని తలచాడు. అంతకుమించిన భాగ్యం ఉండదని అనుకున్నాడు. ఆ వెంటనే మరొక

మాట కూడా అతని చెవిన పడింది. పేరు నమోదు చేసుకుంటూ మూడు వందల రూపాయలు ఫీజు కట్టవలెనని కూడా ప్రకటించారు. ఇది విన్న విశ్వనాథరావుకు బెంగ పట్టుకుంది. ఎంతో కష్టపడితే తనకు రోజుకు రెండు రూపాయలు లభిస్తాయి. అంటే నెలకు అరవై రూపాయలన్నమాట. అటువంటిది ఒక్కసారి మూడు వందల రూపాయలు ఎలా సంపాదించాలి. ఇలా తలచి విశ్వనాథరావు ఎంతో నిరాశపడ్డాడు.

రాత్రి ఇంటికి వచ్చి భార్యతో ఈ విషయం అంతా చెప్పాడు. భార్య అతడితో మనం ఆ సాయినాథుని నమ్ముకున్నాం. అన్నీ ఆ షిర్డీవాసుడే చూసుకుంటాడని అన్నది. మూడు వందల రూపాయలు కట్టడానికి ఇంక ఇరవై రోజులు మాత్రమే ఉంది. ఈ ఇరవై రోజులలో మూడు వందల రూపాయలు దొరకడం విశ్వనాథరావుకి చానా కష్టంగా తోచింది. ఆ సాయినాథుడే దిక్కని తలచాడు.

సాయినాథుడు నమ్మినవారిని నిత్యం రక్షించే దైవం. ఎవరైతే మనస్ఫూర్తిగా తననే కొలుస్తారో వారిని అనునిత్యం కంటికి రెప్పలా కాపాడే అమృతమూర్తి సాయినాథుడు. ఆ ప్రేమమూర్తికి తనను నమ్మినవారంటే అపారమైన కరుణ. ఆ సాయినాథుని అనుగ్రహంతో విశ్వనాథరావుకి ఆ తరువాత రోజులలో ఎప్పటికంటే ఎక్కువ పని దొరికింది. అలా ఇరవై ఎనిమిదవ తారీకు వచ్చింది. దాదాపు రెండు వందల రూపాయలు పోగు పడ్డాయి. తన జీవితంతో ఇంత తక్కువ సమయంలో ఇంత డబ్బు ఎప్పుడూ రాలేదు. ఇదంతా ఆ స్వామి మహిమగా తలచాడు. అయితే ఇంక రెండు రోజులే ఉంది. ఈ రెండు రోజులలో మరో నూరు రూపాయలు రావాలి. అయితే ఆ రెండు రోజులు పెద్దగా పని దొరకలేదు. కేవలం పది రూపాయలు మాత్రమే వచ్చాయి.

ఒకటవతారీకు వచ్చింది. తన దగ్గరగల కేవలం రెండు వందల పది రూపాయలు మాత్రమే ఉన్నాయి. అవి తీసుకుని ఉదయాన్నే రెవిన్యూ కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ ఒక గుమస్తా కనపడితే అతడిని తన దగ్గర రెండు వందల పది మాత్రమే ఉన్నాయని ఇప్పుడు ఈ సొమ్ము కట్టి మిగిలినది తరువాత కట్టవచ్చునా అని అడిగాడు. అయితే ఇది ఏ మాత్రం వీలు కుదరదని మొత్తం మూడు వందలూ ఈ రోజు కట్టినవాళ్ల పేరులే నమోదు చేసుకుంటారని అతడు అన్నాడు. ఇది విన్న విశ్వనాథరావు ఎంతో నిరాశ చెందాడు. మనస్సు ఏమీ తోచక ఆ ఆఫీసులోనే అటూ ఇటూ తిరిగాడు. ఏం చేయాలో పాలు పోవడం లేదు. ఇంక కొద్ది గంటలలో తన ఆశలన్నీ వమ్ము కావలసిందే. ఎంతో బాధతో ఆ షిర్డీ నాథునే తలచుకుంటూ అటుగా వచ్చిన మరో ఇద్దరు వ్యక్తులను ఈ విషయమే అడిగాడు. వారు కూడా ఇదే చెప్పారు. సాయంత్రంలోపు మూడు వందల రూపాయలు కట్టినవాళ్ళకే ఇళ్ళు దొరుకుతుందని అన్నారు.

విశ్వనాథరావుకి ఏమీ తోచక అక్కడ ఉన్న టీ దుకాణం వద్ద కూర్చుని పది పైసలతో ఛాయి తాగాడు. కనులు మూసుకుని ఆ సాయినే ప్రార్థించాడు. స్వామీ! ఇంక నాకు సొంత ఇల్లు ప్రాప్తం లేదా అని బాధపడ్డాడు. అలా ఒక గంట గడిచింది. మళ్ళీ ఒకసారి ఆఫీసులోనికి వెళ్ళి ఎవరైనా పెద్ద ఆఫీసరుని కలిసి తన గోడు చెప్పుకుందామని తలచాడు. లోపలికి వెళ్లి ఆఫీసరుకి నమస్కరించి తన పేరు విశ్వనాథరావు అని, తాను చెప్పులు కుట్టుకుంటూ కాలం గడుపుతున్నానని చెప్పబోయాడు. వెంటనే ఆ ఆఫీసరు ఆగు నాయనా! ఆగు. ఇప్పుడే నీ తండ్రి వచ్చి నీ పేరుమీద మూడు వందల రూపాయలు కట్టి వెళ్ళాడు కదా. నీకు త్వరలోనే ఇల్లు మంజూరు అవుతుంది అని అన్నాడు. ఎంతో ఆశ్చర్యపోతూ తాను ఏదో చెప్పబోతుండగా ఆఫీసరు తన పేరున ఉన్న దరఖాస్తును, మూడు నూరు రూపాయల నోట్లను చూపాడు. జరిగింది విశ్వనాథరావుకి అర్థం కాలేదు. ఒక్కసారిగా ఆశ్చర్యపోయాడు. ఆఫీసరుతో ఏదో అనబోతుండగా నౌకరు వచ్చి పదవయ్యా పద బయటకు పద, సారుకి చాలా పనులు ఉన్నాయి. ఇందాక మీ ముసలాయన వచ్చి కట్టి వెళ్ళాడని చెప్పాడు కదా. పద పదమని బయటికి పంపివేశాడు.

జరిగినవిషయం విశ్వనాథరావుకి అర్థమైంది. అతడి ఆనందానికి అవధులు లేవు. ఆ సాయినాథుడే వచ్చి తన తరపున కట్టి వెళ్ళాడని తలచాడు. తాను నమ్మిన ఆ సాయినాథుడు తనను ఈవిధంగా ఇంటిని బహూకరించినందుకు ఆనందంతో అతని కనులు చమర్చాయి. ఇంటికి వెళ్ళి జరిగిందంతా భార్యకు చెప్పాడు. ఆ కుటుంబం ఆనందం ఇంతా, అంతా కాదు. తాను నమ్మినసాయి తనను ఎంతగా అనుగ్రహించాడో తలచుకుని ఎంతో సంతోషించాడు. కొద్దికాలానికే వారికి ఇల్లు మంజూరు చేయబడింది. ఒక మంచి రోజు చూసుకుని ఆ ఇంట్లో చేరి జీవించినంత కాలం ఆ సాయినాథునే సేవిస్తూ కలకాలం సుఖంగా జీవించాడు.

సాయినాథుని నమ్మినవారికి దేనికీ లోటుండదు. ఆ షిర్డీనాథుని నిత్యం తలచేవారికి ఆ స్వామి ఎల్లప్పుడూ అండగా ఉంటాడు. ఎప్పుడూ కంటికి రెప్పలా కాపాడుతుంటాడు. సన్మార్గంలో జీవిస్తూ తోటివారందరిలో ఆ సాయినాథునే చూసేవారికి దేనికీ లోటుండదు. ఎటువంటి ఆపదా దరి చేరదు. జీవితం సుఖంగా గడుస్తుంది.

మొదటి అధ్యాయము సమాప్తము

ఓం సమర్థ సద్గురు సాయినాథాయ నమః
ఓం శ్రీ సాయినాథాయ నమః
ఓం శ్రీ సాయిదేవాయ నమః

# శ్రీ సాయిరక్షా వ్రతం

## రెండవ అధ్యాయం

### భానోజిరావు కథ

పూర్వకాలంలో గుల్బర్గా పట్టణానికి యాభై మైళ్ళ దూరంలో చిన్న గ్రామం ఉండేది. ఆ గ్రామంలో భానోజి అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు చిన్న చిన్న పౌరోహిత్య పనులు చేసుకుంటూ కాలం గడిపేవాడు. ఒకసారి ఒకరింటికి శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం చేయడానికి వెళితే వారింట్లో సాయినాథుని ఫోటో చూశాడు. ఆ ఫోటోను తదేకంగా చూస్తూ ఒళ్ళు మరిచిపోయాడు. ఇతడి ఆనందం గమనించిన ఇంటి యజమాని ఇంటిలోనుంచి సాయినాథుని ఫోటో మరొకటి తెచ్చి ఇతడికి ఇచ్చాడు.

భానోజీ ఇంతకుముందు సాయినాథుని లీలల గురించి విన్నాడే కానీ, ఫోటో చూడలేదు. ఆ పటం చూస్తున్నకొద్దీ చూడలనిపిస్తూ ఉంది. ఆ స్వామి కళ్ళలో కరుణ రసం తొణికిసలాడుతోంది. తననే ఎంతో ప్రేమగా చూస్తున్నట్లు అనిపిస్తోంది. భానోజీ రావుకు ఆ ఫోటోనుంచి చూపు మరల్చబుద్ధి కావట్లేదు. ఆ ఫోటో తెచ్చుకుని ఇంట్లో జాగ్రత్తగా పెట్టుకున్నాడు. ప్రతీరోజు ఉదయం అందరి దేవతలతోపాటే సాయినాథునికి కూడా నమస్కరించేవాడు. ఎప్పటికైనా షిర్డీ వెళ్ళి సాయిని దర్శించాలని మనస్సులో ఎంతో కోరికగా ఉండేది.

ఆ నోటా, ఈనోటా సాయినాథుని మహిమలు రోజూ ఎన్నో వినేవాడు. సాయి తత్వానికి ఎంతో ఆకర్షితుడయ్యాడు. ప్రతి నిత్యం ఆ సాయినాథునే తలుస్తూ ఉండేవాడు. శ్రీ సాయినాథుడు ప్రేమ స్వరూపుడు. ఆ స్వామిని నమ్మిన కొలిచేవారిని కంటికి రెప్పలా కాపాడే అమృతమూర్తి. సాయినాథుని కరుణా కటాక్షాలతో భానోజీ జీవితం సాఫీగా సాగిపోతోంది. భానోజీకి భార్య, ఇద్దరు కుమార్తెలు. అందరూ నిత్యం ఆ సాయినాథునే స్మరిస్తూ కాలం గడిపేవారు.

రోజులిలా గడుస్తుండగా ఒకనాడు భానోజీకి తీవ్రమైన కడుపునొప్పి వచ్చింది. ఇంటి దగ్గరలోని డాక్టరు వద్దకు వెళితే ఏదో మందిచ్చి పంపాడు. అది వాడినా ఏ మాత్రం తగ్గలేదు. సాయీ! నన్ను రక్షించు, ఈ బాధనుండి ఉపశమనం కలిగించు తండ్రీ అని ఆ సాయినాథుని వేడుకున్నాడు.

నొప్పి మరునాడు మరింత ఎక్కువైంది. ఇంక లాభం లేదనుకుని ఆ ఊర్లో గల

రామనాథం అనే పెద్ద వైద్యుడి వద్దకు వెళ్ళాడు. రామనాథానికి చిన్న ఆసుపత్రి ఉంది. రామనాథం భానోజీని పరీక్ష చేసి త్వరగా ఆపరేషన్ చెయ్యవలసి వస్తుందని అన్నాడు.. అయితే ఈ ఆపరేషన్ చేయడం తన వల్లకాదని గుల్బర్గాలో తనకు తెలిసిన డాక్టర్ పల్నీత్కర్‌కు ఫోన్ చేస్తానని, అతడు మూడు, నాలుగు గంటలలో వచ్చి ఆపరేషన్ చేస్తాడని అన్నాడు. అప్పటిదాకా భానోజీ కదలకుండా పడుకోవాలని అన్నాడు. ఇదంతా విన్న భానోజీకి ఎంతో భయం వేసింది. గుల్బర్గానుంచి ఆ వైద్యుడు ఎప్పుడు వస్తాడు? ఆపరేషన్ ఎప్పుడు జరుగుతుంది? అని ఎంతో ఆందోళన చెందాడు.

ఇంతలో డాక్టర్ రామనాథం వచ్చి గుల్బర్గాలోని డాక్టర్ పల్నీత్కర్‌కు ఫోన్ చేశానని నాలుగైదు గంటలలో వస్తాడని అన్నాడు. ఈ లోపు ఆపరేషన్ ఏర్పాట్లన్నీ తాను సిద్ధం చేసి ఉంచుతానని, ఆందోళన చెందవద్దని అన్నాడు. భానోజీకి నిమిష నిమిషానికి నొప్పి ఎక్కువ కాసాగింది. ఆ డాక్టర్ వచ్చేవరకు తన ప్రాణం నిలుస్తుందానన్న భయం పుట్టుకుంది. భార్య, పిల్లలకు కూడా ఎంతో భయం వేసింది. నిమిష నిమిషానికి ఆందోళన ఎక్కువ కాసాగింది. రెండు గంటలు గడిచాయి. నొప్పి ఇంకా ఎక్కువయింది కానీ, ఇంకా ఏమాత్రం తగ్గటం లేదు. భానోజీ అటుగా వెళుతున్న డాక్టర్ రామనాథం ముఖంలో కూడా ఆందోళన గమనించాడు. ఇక తనను ఆ సాయినాథుడే రక్షించాలని తలచి, ఆ స్వామినే ప్రార్థింపసాగాడు. నాలుగు గంటలు గడిచాయి. గుల్బర్గానుంచి రావలసిన డాక్టర్ పల్నీత్కర్ జాడలేదు. డాక్టర్ రామనాథం ఎంతో ఆందోళన చెందుతూ అటూ ఇటూ తిరుగుతున్నాడు. ఇంకో అరగంటలో ఆపరేషన్ చేయకపోతే ఈ బ్రాహ్మణునికి ఏదైనా అపాయం జరగవచ్చునని బాధ పడుతున్నాడు.

ఇంతలో ఆసుపత్రి బయట ఒక జట్కా బండి ఆగింది. అందులోనుంచి ఒక మిసిమి ఛాయలో మెరిసిపోతున్న వ్యక్తి దిగాడు. తనను గుల్బర్గాలోని డాక్టర్ పల్నీత్కర్ పంపారని ఆయనకు ఏదో అర్జంటు ఆపరేషన్ ఉండి రాలేకపోయానని చెప్పాడు. తన పేరు డాక్టర్ కృష్ణారావు అని అన్నాడు. ముందు లోపలికి పదండి, ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆపరేషన్ చేద్దాం అని అన్నాడు. అతడిని చూసిన భానోజీ కుటుంబానికి ప్రాణం లేచి వచ్చింది. రామనాథం వచ్చిన డాక్టరుని తీసుకుని ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్లాడు. ఇరవై నిమిషాలలో ఆపరేషన్ విజయవంతంగా ముగిసింది. అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గుల్బర్గానుంచి వచ్చిన డాక్టర్ కృష్ణారావు ఆ జట్కా బండి ఎక్కి వెళ్ళిపోయాడు.

డాక్టర్ రామనాథం భానోజీ దగ్గరకు వచ్చి అంతా ఆ సాయినాథుని దయ అని సమయానికి డాక్టర్ రావడం వలన భానోజీ పెద్ద అపాయం నుంచి బయట పడ్డాడని

ఇంక ఏ బెంగ అవసరం లేదని అన్నాడు. భానోజీ భార్యతో కూడా ఇదే చెప్పాడు. ఆ కుటుంబం సాయినాథునికి మనస్సులో ఎన్నో విధాల నమస్కరించింది. రేపు ఉదయం దాకా విశ్రాంతి తీసుకోమని చెప్పి రామనాథం వెళ్ళిపోయాడు.

ఇంతలో ఒక గంట గడిచింది. హాస్పిటల్‌లోనికి ఉరుకు, పరుగున ఒక బ్యాగుతో ఒక వ్యక్తి వచ్చాడు. తాను డాక్టర్ పల్నీత్కర్‌ని అని గుల్బర్గానుంచి ఆపరేషన్ చేయడానికి వచ్చానని అన్నాడు. వస్తూనే రామనాథంతో డాక్టర్ నేను వస్తున్న బస్సు దారిమధ్యలో చిన్న ప్రమాదం జరిగి ఇంత ఆలస్యమయ్యింది. ఆ పేషెంటు ఎలా ఉన్నాడో అని ఆందోళనగా ఉంది. పదండి డాక్టర్ వెంటనే ఆపరేషన్ చేద్దాం అని రామనాథంతో అన్నాడు.

రామనాథం ఎంతో ఆశ్చర్యంతో ఇదేమిటి డాక్టర్ ఇంతకుముందే మీ హాస్పిటలు నుంచి డాక్టర్ కృష్ణారావు వచ్చి వెళ్ళాడు కదా అని అన్నాడు. ఇప్పుడు ఆశ్చర్యపడటం ఫల్నీత్కరు వంతు అయ్యింది. అదేం డాక్టర్ సాబ్! నాకు కృష్ణారావు అనే డాక్టరు ఎవ్వరూ తెలీదు. నా దగ్గరే కాదు, గుల్బర్గాలోనే ఆ పేరున్న డాక్టరు ఎవరూ లేరన్నాడు. అప్పుడు జరిగింది అందరికీ అర్థమైంది. తనను నమ్ముకున్న భక్తుడు భానోజీని రక్షించడానికి స్వయంగా సాయినాథుడే డాక్టరు రూపంలో వచ్చాడు. ఈ విషయం గ్రహించిన వారందరూ సాయినాథునికి తన భక్తులపైగల ప్రేమకి ఎంతో ఆనందించారు. వారందరి కనులు ఆనందంతో చెమర్చాయి.

అప్పటినుంచి వారందరూ సాయిభక్తులై ప్రతీ గురువారం ఎంతో అద్భుతంగా సాయినాథుని భజనలు నిర్వహించేవారు. భానోజీ కుటుంబం అంతా జీవితమంతా సాయినాథునే సేవిస్తూ కలకాలం సుఖంగా జీవించారు.

సాయి అద్భుతమైన కరుణామూర్తి. ఆ షిర్డీ సాయినాథుని నమ్మినవారికి ఏ ఆపదా దరిచేరదు. తలపెట్టిన అన్ని కార్యాలయందూ జయం కలుగుతుంది. జీవితం శుభప్రదంగా జరగుతుంది. ఆ సాయినాథుని నిత్యం తలచేవారిని ఆ అమృతమూర్తి ఎప్పుడూ కనిపెట్టుకుని ఉంటాడు. వారి యోగక్షేమాలన్నీ తానే వహిస్తాడు. ఆ సాయినాథుడు అంతటి కరుణామూర్తి.

రెండవ అధ్యాయము సమాప్తము
ఓం సమర్థ సద్గురు సాయినాథాయ నమః
ఓం శ్రీ సాయినాథాయ నమః
ఓం శ్రీ సాయిదేవాయ నమః

# శ్రీ సాయిరక్షా వ్రతం
## మూడవ అధ్యాయం
## పండిట్ రామశాస్త్రి కథ

పూర్వకాలంలో బీజాపూర్ పట్టణానికి ముప్ఫైమైళ్ళ దూరంలోగల చిత్రాపూర్‌లో పండిట్ రామశాస్త్రి అనే పురోహితుడు ఉండేవాడు. అతడెంతో నియమ నిష్టలతో జీవిస్తూ ఆ చుట్టుప్రక్కల ఊళ్ళల్లో పౌరోహిత్యం నిర్వర్తిస్తూ కాలం గడిపేవాడు. ఎవ్వరినీ ఇంత సొమ్ము ఇవ్వమని గట్టిగా అడగకుండా వారిచ్చినదానితోనే సంతృప్తి చెందుతూ ఉండేవాడు. అతడి భార్య రుక్మిణి కూడా భర్తకు చేదోడు వాదోడుగా ఉండేది. వారికి వివాహం జరిగి ఆరు సంవత్సరాలయినా సంతానం కలగకపోవడం వెలితిగా ఉండేది.

సంతానం కోసం పండిట్ రామశాస్త్రి దంపతులిద్దరూ చెయ్యని వ్రతం లేదు. ఆరాధించని దేవుడు లేడు. అయినా ఎందుకో వారికి సంతానం కలుగలేదు. తమకింక ఈ జన్మకు సంతానప్రాప్తి లేదనుకుని బాధపడేవారు. ఒకనాడు రామశాస్త్రి ఏదో కార్యక్రమం నిమిత్తం కాలినడకన పక్కఊరు వెళుతుండగా ఒక ఫకీరు ఎదురుపడ్డాడు. అతడిని దాటి ముందుకు వెళుతున్న రామశాస్త్రిని ఆపి ఆ ఫకీరు ఇలా అన్నాడు. నాయనా! నీకు సంతానం లేదని బాధగా ఉంది కదూ! నీవు శ్రీ సాయి రక్షా వ్రతాన్ని ఆచరించు. తప్పక నీకు త్వరలో సంతానం కలుగుతుంది అని అన్నాడు. ఇది విన్న రామశాస్త్రి ఎంతో ఆశ్చర్యపోయాడు. తనకు సంతానం లేని విషయం ఈ సాధువుకు ఎలా తెలిసిందా అని అనుకున్నాడు. వెంటనే ఆ ఫకీరుకు నమస్కరించి ఆ వ్రత విధానాన్ని చెప్పమని అడిగాడు. ఆ ఫకీరు సాయి రక్షా వ్రత విధానాన్ని వివరంగా తెలియపరచాడు. ఇది ఎంతో తేలికైనదని, ఆచరించిన వెంటనే మంచి ఫలితం ఉంటుందని అన్నాడు. ఆ ఫకీరు మరో విషయం కూడా చెప్పాడు. నాయనా! రామశాస్త్రీ! సాయినాథునికి తన భక్తులెంటో ఎంతో అభిమానం. మీ అందరినీ తన స్వంత బిడ్డలవలె తలుస్తాడు. మీ యోగక్షేమాలు తానెప్పుడూ గమనిస్తుంటాడు. ఈ వ్రతం ప్రశాంత మనస్సుతో ఆచరిస్తే వ్రతం పూర్తికాగానే ఆ సాయినాథుడు ఏదో ఒక రూపంలో మీ ఇంటికి వచ్చి తాను కూడా ప్రసాదం స్వీకరిస్తాడు. మీకు తెలిసిన బంధువుల రూపంలోనో లేదో ఏదైనా అపరిచిత వ్యక్తి రూపంలోనో లేకపోతే కుక్కగానో, పిల్లిగానో, ఏ క్రిమికీటకాల రూపంలోనో, పక్షి రూపంలోనో ఇలా ఏదో ఒకరూపంలో వచ్చి ప్రసాదం తప్పక స్వీకరిస్తాడు. ఎంతో ప్రశాంత మనస్సుతో ఆ సాయినాథునే స్మరిస్తూ వ్రతం చేసినవారింటికి తాను తప్పక వచ్చి ప్రసాదం స్వీకరిస్తాడు అని చెప్పాడు.

రామశాస్త్రి ఆ సాధువుకు నమస్కరించి ముందుకు సాగి పక్క ఊరు వెళ్ళి అక్కడ

జరిగే నామకరణ మహోత్సవం చక్కగా జరిపించాడు. ఆరోజు ఎప్పటికంటే ఎక్కువ సంభావన లభించింది. తిరిగి ఇంటికి రాగానే భార్య రుక్మిణికి ఫకీరు తనని కలవడం, సాయి రక్షా వ్రతం విధానం చెప్పడం వివరించాడు. ఆమె కూడా ఎంతో సంతోషపడింది. ఆ సాయినాథుడే తమను అనుగ్రహించడానికి ఆ ఫకీరు రూపంలో వచ్చాడని రామశాస్త్రి దంపతులు తలచారు. మరునాడే వారి బంధువులను, చుట్టుపక్కలవారిని పిలిచి ఎంతో చక్కగా ఆ సాయినే స్మరిస్తూ శ్రీ సాయి రక్షా వ్రతం ఆచరించారు. ఆ వ్రతం ఫలితంగా తరువాత నెలలోనే రుక్మిణి గర్భం దాల్చి పండంటి పిల్లవాడిని ప్రసవించింది. సాయినాథుని అనుగ్రహంతో పుట్టడంచేత సాయిరాం అనే పేరు పెట్టారు. సాయిరాం పెరిగి పెద్దవాడై అయిదవ తరగతిలోనికి వచ్చాడు.

రోజులిలా గడుస్తుండగా ఒకనాడు రామశాస్త్రికి బీజాపూర్‌నుంచి ఆ శనివారం నాడు ఒక ధనవంతుని ఇంట్లో అన్నప్రాసన కార్యక్రమం నిర్వర్తించడానికి కబురు వచ్చింది. ఆ రోజుల్లో వీరి ఊరు మీదుగా బిజాపూర్ వెళ్ళడానికి ఉదయం ఆరు గంటలకు ఒక బస్సు ఉండేది. తరువాత మళ్ళీ సాయంత్రం అదే బస్సు తిరిగి ఈ ఊరుమీదుగా వెళ్లేది. శనివారం రాగానే రామశాస్త్రి ఉదయాన్నే లేచి సంధ్యావందన కార్యక్రమాలు పూర్తి చేసుకుని కావలసిన సామాను సర్దుకుని అయిదు గంటలకే ఇంట్లోనుండి బయలుదేరాడు. బిజాపూర్ వెళ్లే బస్సు ఊరిబయట రోడ్డుమీద ఆగుతుంది. అక్కడికి ఊరిలోనుంచి ఒక అరగంట కాలినడక. రామశర్మ సంచి భుజం మీద వేసుకుని వడివడిగా నడవసాగాడు.

కొంతదూరం వెళ్ళగానే ఆ రోజు కనపడిన సాధువు మరలా కనపడ్డాడు. రామశాస్త్రి వెంటనే అతడికి నమస్కరించి ఆ స్వామి చెప్పినట్లుగానే శ్రీ సాయి రక్షా వ్రతం తాను చేశానని పిల్లవాడు కలిగాడని చెప్పాడు. తాను త్వరగా వెళ్ళాలని చెప్పి ఆ ఫకీరుకు నమస్కరించి ముందుకు నడిచాడు. కానీ ఆ ఫకీరు మాత్రం రామశాస్త్రిని ఆపి ఆ రోజు వ్రతం ఎలా జరిగింది, ప్రతీ సంవత్సరం వ్రతం చేస్తున్నారా, పిల్లవాడికి పేరు ఏం పెట్టారు, ఇలా ఒకదానివెనుక మరొకటి ఎన్నో ప్రశ్నలు వేశాడు. రామశాస్త్రి అన్నిటికీ సమాధానం చెప్పాడు. మనస్సులో ఒక ప్రక్క ఆ బస్సు ఎక్కడ తప్పిపోతుందోనని ఆందోళనగా ఉంది. అందునా బిజాపూర్‌లో ధనవంతుడి ఇంట కార్యక్రమం. మామూలుకంటే నాలుగు రూపాయల సంభావన ఎక్కువగా దొరుకుతుంది కదా అనే ఆలోచన. ఈ ఫకీరు మాత్రం తనను వదలడం లేదు. ఒక ప్రశ్నకు సమాధానం చెబితే వెంటనే మరొక ప్రశ్న సంధిస్తున్నాడు. రామశాస్త్రికి కొంచెం చిరాకుగా అనిపించింది. ఈ విధంగా ఇరవై నిమిషాలు గడిచాయి. అప్పుడు ఆ ఫకీరు రామశాస్త్రిని వదిలి చిరునవ్వుతో వెళ్లిపోయాడు.

రామశాస్త్రి నడక వేగం పెంచి వడి వడిగా నడుస్తూ ఊరు బయట రోడ్డువద్దకు వచ్చాడు. ఒక్క క్షణంలో రోడ్డు వద్దకు చేరుతుండగా తను ఎక్కవలసిన బిజాపూర్ బస్సు వెళ్ళిపోవడం కనిపించింది. రామశాస్త్రి ఎంతో నిరాశ పడ్డాడు. అయ్యో! ఇంక ఈ కార్యక్రమానికి వెళ్లలేను కదా అని చింతించాడు. ఆ ఫకీరు కనపడి ఏవేవో మాట్లాడటం వలన ఇంత ఆలస్యమై ఈ బస్సు తప్పిపోయింది. బీజాపూర్‌లో ధనవంతుడు ఎంత డబ్బు ఇచ్చేవాడో కదా అనుకుంటూ నిరాశ, నిస్పృహలతో వెనుదిరిగాడు. ఇంటికి వచ్చి భార్యకు జరిగినదంతా చెప్పాడు. ఇంతలో ఉదయం పదిగంటలయ్యింది. ఇంతలో పక్క ఇంట్లోనుంచి ఏడుపు వినిపించింది. ఏమిటా అని వెళ్లి చూశాడు. తాను ఎక్కకుండా తప్పిపోయిన బస్సు ఊరు బయటకు వెళ్ళగానే పక్కన ఉన్న కాలువలో పడిపోయిందట, దాదాపు పదిమంది అక్కడికక్కడే మరణించారని, కొంతమందికి తీవ్రగాయాలయ్యాయని తెలిసింది. పక్క ఇంటివాళ్ల కుమారుడు తీవ్రగాయాలై ఆసుపత్రిలో ఉన్నాడని వీరికి కబురు వచ్చింది. ఈ విషయం తెలిసి ఈ కుటుంబం అంతా ఎంతో ఆందోళనలో ఉన్నారు.

రామశాస్త్రి దంపతులకు జరిగినదంతా అర్థమైంది. ఫకీరు రూపంలో వచ్చి తనను ఆ ఆపద నుండి కాపాడింది సాయినాథుడేనని గ్రహించాడు. తనను ఆ బస్సు ప్రమాదం నుంచి తప్పించడానికే తన దారికి అడ్డం వచ్చి అనేక ప్రశ్నలు వేసి అంతసేపు తనను ఆపాడని గ్రహించాడు. సాయీ! నీవెంతటి కరుణామయుడవు తండ్రీ. నిన్ను అనవసరంగా నిందించాను. నా ప్రాణాలు కాపాడటం కోసం నన్ను ముందుకు పోనీకుండా అడ్డుకున్నావు. నిన్ను విసుక్కున్నందుకు క్షమించు తండ్రీ. నా అపరాధం మన్నించు తండ్రీ అని ఆ దంపతులిద్దరూ సాయినాథుని పరిపరివిధాల వేడుకున్నారు.

అప్పటినుండి ప్రతీ గురువారం నాడు ఆ దంపతులిద్దరూ శ్రీ సాయిరక్షా వ్రతం ఆచరిస్తూ ఎల్లప్పుడూ సాయినే సేవిస్తూ కాలం గడిపారు. జీవించినంతకాలం సుఖంగా జీవించి చివరన ఆ సాయినాథునిలోనే ఐక్యమైనారు. షిర్డీ సాయి అంతటి అమృతమూర్తి. ప్రతిరోజు ఒక్కసారైనా సాయినామ స్మరణ చేస్తే చాలు. ఆ స్వామి ఆ కుటుంబాన్ని తప్పక ఆదుకుంటాడు. ఎటువంటి అపదలూ రాకుండా కాపాడతాడు. జీవితం శుభప్రదంగా జరిగేలా అనుగ్రహిస్తాడు.

మూడవ అధ్యాయము సమాప్తము

ఓం శ్రీ సమర్థ సద్గురు సాయినాథాయ నమః

ఓం శ్రీ సాయినాథాయ నమః

ఓం శ్రీ సాయిదేవాయ నమః

# శ్రీ సాయిరక్షా వ్రతం

## నాలుగవ అధ్యాయం

### ఆనందరావు కథ

పూర్వకాలంలో మహారాష్ట్రలోని షోలాపూర్‌కు నలభై మైళ్ల దూరంలో ఒక పల్లెటూరు ఉండేది. ఆ ఊరిలో ఆనందరావు అనే బట్టలు నేసే వ్యక్తి ఉండేవాడు. భార్య సక్కుబాయి కూడా భర్తకు నేతపనిలో ఎంతో సహాయపడుతూ ఉండేది. ఆ వీధి మొత్తం ఆనందరావు అన్నదమ్ముల కుటుంబాలే నివసించేవి. అందరూ బట్టలు నేసే వృత్తిలోనే ఉండేవారు.

ఆనందరావు దంపతులకు జీవితం సాఫీగా గడిచిపోతున్నప్పటికీ సంతానం లేని వెలితి ఉండేది. మిగిలిన అన్నదమ్ములందరికీ పిల్లలు కలిగినప్పటికీ వీరికి మాత్రం వివాహం జరిగి తొమ్మిది సంవత్సరాలయినా ఇంకా సంతానం కలుగలేదు. సంతానం కోసం ఎన్నో నోములు, వ్రతాలు చేసినా ఫలితం లేకపోయింది. ఒకనాడు వారికి అహ్మద్‌నగర్ నుంచి వచ్చిన ఒక వ్యాపారి ద్వారా శ్రీ సాయి రక్షా వ్రతం గురించి తెలిసింది. ఆ వారంలో వచ్చిన గురువారం నాడే ఆనందరావు దంపతులు సాయి రక్షావ్రతం ఆచరించారు. సాయిని స్మరిస్తూ తమకు సంతానం ప్రసాదించవలసిందిగా వేడుకున్నారు. భక్తవత్సలుడైన సాయినాథుని కరుణతో వారికి చక్కటి మగపిల్లవాడు పుట్టాడు. అతడికి సాయికృష్ణ అనే పేరు పెట్టారు. పిల్లవాడు పుట్టినందుకు ఆనందించారు. కానీ అతడికి పుట్టుకతోనే మూగతనం. ఇందుకు వారెంతో బాధపడ్డారు.

రోజులిలా గడుస్తుండగా ఒకనాడు ఉదయం పక్కనే బంధువుల పిల్లలతో ఆడుకుంటున్న సాయికృష్ణ ఉన్నట్టుండి మాయమయ్యాడు. గంటలు గడుస్తున్నా అతని జాడ తెలియలేదు. పిల్లవాడు ఎక్కడికి వెళ్లాడో అర్థం కాక ఆనందరావు దంపతులు అన్నదమ్ములతో కలిసి చుట్టుపక్కల వీధులన్నీ వెతికారు. ఎక్కడా కనపడలేదు. నోటి మాట కూడా రాదు. ఏమీ చెప్పలేడు. ఏమైపోయాడా అని వారెంతో ఆందోళన చెందారు. ఊరంతా వెతికినా ఎక్కడా సాయికృష్ణ కనపడలేదు. అప్పటికి మధ్యాహ్నం రెండు గంటలవుతోంది. పిల్లవాడు ఏమయ్యాడో, ఏమన్నా తిన్నాడో లేదోనని తల్లిదండ్రులకు ఎంతో కంగారు ఆందోళన కలిగింది. ఆకలేస్తే కావాలని చెప్పడం కూడా తెలియదు. ఎంతో అమాయకంగా ఉంటాడు. ఎటు వెళ్ళాడో, ఎలా ఉన్నాడో అని ఎంతో బాధపడ్డారు. ఆ ఊరిలో తెలిసినవారందరికీ ఈ విషయం చెప్పారు.

ఇంతలో దూరంగా ఒక వ్యక్తి పక్కనే చేయి పట్టుకుని నడిచి వస్తున్న సాయికృష్ణ కనపడ్డాడు. ఒక్క పరుగున అతడి వద్దకు వెళ్లి పిల్లవాడిని కౌగిలించుకున్నారు. సాయికృష్ణను

తీసుకుని వచ్చిన వ్యక్తితో ఆనందరావు ఇలా అన్నాడు. నాయనా! నీకెలా కృతజ్ఞతలు చెప్పాలో తెలియడం లేదు. ఈ పిల్లవాడు అసలే మూగవాడు. ఉదయం నుంచి ఎటు వెళ్ళాడో తెలియక కంగారు పడుతున్నాం అని ఇంకా ఏదో చెబుతుండగా ఆ వ్యక్తి ఇలా అన్నాడు. ఆగండి, ఆగండి! ఈ పిల్లవాడు మూగ ఏంటి, చక్కగా మాట్లాడుతుంటేనూ! అని అన్నాడు. అంతేకాక తాను పక్క ఊరి జమీందారు ఇంట్లో గుమస్తానని, జమీందారు నేడు పెద్ద ఎత్తున సాయి రక్షా వ్రతం చేశాడని చెప్పాడు. అక్కడకు వచ్చిన అనేకమందిలో ఈ పిల్లవాడు కూడా ప్రసాదం తీసుకున్నాడని అటు తరువాత, తన ఊరిపేరు, తన తల్లిదండ్రుల పేర్లు చెబితే తాను ఇతడిని ఇలా తీసుకువచ్చానని అన్నాడు. ఇదంతా విన్న ఆనందరావు దంపతులు ఆశ్చర్యపోయారు.

ఇంతలో సాయికృష్ణ తల్లిదండ్రులతో ఇలా అన్నాడు. నాన్నా నేను ఉదయం ఇక్కడ ఆడుకుంటున్నప్పుడు ఒక ఫకీరు వచ్చాడు. అతను ఎంత బాగా ఉన్నాడనుకున్నావు? నన్ను తనతోపాటు రమ్మని అన్నాడు. నేను ఏమీ ఆలోచించకుండా, ఏ భయం లేకుండా అతడివెంట వెళ్ళాను. అతడు నన్ను పక్క ఊరు తీసుకువెళ్ళి అక్కడ జమిందారు ఇంటివద్ద వదలి ఎటో వెళ్ళిపోయాడు. ఫకీరు కోసం అటూ ఇటూ చూస్తుండగా అక్కడ జమీందారు గుమస్తా ఏదో ప్రసాదం ఇస్తుంటే నేను కూడా తీసుకున్నాను. అంతే! అది నోట్లో వేసుకున్న వెంటనే నాకు మాటలు వచ్చాయి. అని వివరంగా చెప్పాడు. ఆ వచ్చిన ఫకీరు సాయినాథుడు తప్ప మరొకరు కాదని, ఆనందరావు దంపతులు గ్రహించారు. తమను అనుగ్రహించి, తమ పిల్లవానికి మాటలు తెప్పిచ్చినందుకు ఎంతో ఆనందపడ్డారు. అప్పటినుంచి ప్రతీ గురువారం నాడు శ్రీ సాయి రక్షా వ్రతం ఆచరిస్తూ కలకాలం సుఖంగా జీవించారు.

శ్రీ సాయినాథుడు ఎంతో భక్తవత్సలుడు. తనను నమ్మినవారిని నిత్యం కంటికి రెప్పలా కాపాడే అమృతమూర్తి. సాయినాథుని నమ్మినవారికి ఏ ఆపదా దరిచేరదు. తలపెట్టిన పనులన్నింటిలోనూ జయం కలుగుతుంది. జీవితం శుభప్రదంగా గడుస్తుంది.

నాలుగవ అధ్యాయము సమాప్తము

ఓం శ్రీ సమర్థ సద్గురు సాయినాథాయ నమః
ఓం శ్రీ సాయినాథాయ నమః
ఓం శ్రీ సాయిదేవాయ నమః

# శ్రీ సాయిరక్షా వ్రతం

## అయిదవ అధ్యాయం

### బీరప్ప కథ

పూర్వకాలంలో బీదరు పట్టణానికి నలభై మైళ్ళదూరంలో గల పల్లెటూరులో బీరప్ప అనే గొర్రెల కాపరి ఉండేవాడు. బీరప్ప ఏమీ చదువుకోనప్పటికీ ఎంతో సంస్కారంతో, మంచితనంతో చక్కటి నడవడికతో ఉండేవాడు. ప్రతీరోజు తన యజమానినుంచి గొర్రెలు తీసుకునివెళ్ళి ఊరిబయట పచ్చికబయళ్లలో పగలంతా తిప్పి సాయంత్రం ఇంటికి తీసుకువచ్చేవాడు. ఇంటివెనుకన ఉన్న దొడ్లో అన్నింటిని కట్టేసి ఇంటికి చేరేవాడు. మరలా ఉదయమే వచ్చి వీటిని తోలుకొని వెళ్ళేవాడు. ఇదీ ఇతని దినచర్య. బీరప్పకి ఇంకా వివాహం కాలేదు. యజమాని గోవాంకర్ ఇచ్చే నెల జీతంతో కాలం గడిపేవాడు.

బీరప్ప యజమాని గోవాంకర్‌కు ఇంకా ఎన్నో వ్యాపారాలు ఉండేవి. ఎంతో ధనం సంపాదించినప్పటికీ అతడికి ఇంకా పీనాసితనం పోలేదు. తనదగ్గర పనిచేసే నౌకర్లకు పండుగలప్పుడు రెండు రూపాయలు ఇవ్వడానికి కూడా ఎంతో ఆలోచించేవాడు. అయితే ప్రతీ మంగళవారం హనుమాన్ ఆలయానికి వెళ్ళేవాడు. ప్రతీ గురువారం సాయి భజన చేసేవాడు. భజనలో తన కుటుంబం తప్ప మరెవ్వరినీ ఇంట్లోకి రానిచ్చేవాడు కాదు.

రోజులిలా గడుస్తుండగా ఒకనాడు బీరప్ప ఎవరో భక్తులు సాయినాథుని పెద్దఫోటో ఒకదానిని తీసుకుని గోవాంకర్‌కు బహుమానంగా ఇవ్వడానికి తీసుకురావడం చూశాడు.

బీరప్ప సాయినాథుని ఫోటో చూడటం అదే మొదటిసారి. అప్పటిదాకా ఎప్పుడూ చూసి ఉండలేదు. ఆ సాయినాథుని చిత్రపటం బీరప్పను ఎంతగానో ఆకట్టుకున్నది. చిరునవ్వు నవ్వుతున్న ఆ సాయినాథుని చిత్రం బీరప్ప హృదయంలో ముద్ర వేసుకున్నది. ఎప్పుడూ ఆ చిత్రాన్నే మనసులో తలచుకునేవాడు.

రోజూ గొర్రెలు తోలుకెడుతున్నాడేకానీ బీరప్ప మనసంతా ఆ సాయినాథునిమీదే ఉండేది. ఆ సాయిలో ఉన్న ఆకర్షణ అంతటిది. ఎవ్వరినైనా తనవైపు తిప్పుకునే దివ్యమూర్తి షిర్డీనాథుడు. బీరప్పకు తరువాత స్నేహితుల ద్వారా సాయి గురించి తెలిసింది. అప్పటినుంచి బీరప్పలో సాయినాథునిపై భక్తి ఇంకా పెరిగింది. ప్రతీరోజు ఆ స్వామి ధ్యానంలోనే మునిగి తేలేవాడు. ఇలా ఉండగా ఒకనాడు సాయంత్రం గొర్రెలు తీసుకుని ఇంటికి వచ్చాడు. యజమాని గోవాంకర్ ప్రతిరోజు వీటన్నింటిని లెక్క పెడతాడు.

ఆ రోజు ఎంత లెక్కపెట్టినా ఒకటి తక్కువయింది. బీరప్పపై గోవాంకర్‌కి తీవ్ర కోపం వచ్చింది. బీరప్పను గట్టిగా అరచి ఎలాగైనా ఆ గొర్రెను వెతికి తీసుకురమ్మని పంపాడు.

బీరప్ప రాత్రంతా చీకట్లో పడి ఊరు బయటంతా వెతికాడు. కాళ్ళల్లో ముళ్ళు గుచ్చుకుని ఎంతో బాధ కలిగింది. చీకట్లో ఎక్కడ నడుస్తున్నాడో తెలీక నానా యాతన పడ్డాడు. ఈ గొర్రెను తీసుకువెళ్ళకపోతే యజమాని తనను ప్రాణాలతో వదలడని భయపడ్డాడు. రాత్రంతా వెతికినా గొర్రె ఎక్కడా కనపడలేదు. ఉదయం యజమాని ఇంటికి చేరి ఎంత వెతికినా గొర్రె దొరకలేదని చెప్పాడు. గోవాంకర్ ఎంతో కోపంతో ఊగిపోతూ బీరప్పను కొట్టి ఇంక పనిలోకి రానక్కర్లేదని చెప్పి పంపించేశాడు. బీరప్ప కళ్ళనీళ్ళ పర్యంతమై యజమానిని ఎంతో వేడుకున్నాడు. తనకు వేరే ఏ పనీ రాదని క్షమించమని, ఎంతో మొత్తుకున్నాడు. అయినా గోవాంకర్ ఏమాత్రం కరుణించలేదు.

బీరప్ప ఎంతో బాధపడుతూ తన గుడిసె చేరుకున్నాడు. ఈ గొర్రెలు కాయటం తప్ప తనకు మరొక పని రాదు. తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోయారు. తనను ఇంక ఎవరు ఆదరిస్తారు, తన జీవితం గడిచేదెలా అని ఎంతో బాధపడ్డాడు. అప్పుడు బీరప్పకి సాయినాథుడు గుర్తొచ్చాడు. మనస్సులోనే తనకష్టమంతా సాయినాథునికి మొర పెట్టుకున్నాడు. అమృతమూర్తి అయిన షిర్డీనాథుడు బీరప్ప మొరను ఆలకించాడు.

మరునాటినుంచి గోవాంకర్ వ్యాపారం బాగా దెబ్బతింది. నెలరోజులలోనే చాలా నష్టం వచ్చింది. ఇలా రోజు రోజుకి ఇంత నష్టం ఎందుకు వస్తోందో గోవాంకర్‌కు అర్థం కావటంలేదు. ఇంతలో ఒక రోజు ఆ ఊరికి ఎక్కడినుండో ఒక సాధువు వచ్చాడు. అతడు ఎన్నో మహిమలు గలవాడని ఏ సమస్యనైనా తీర్చగలడని జనం చెప్పుకున్నారు. ఇది విన్న గోవాంకర్ ఆ సాధువుని కలిసి తన గోడు విన్నవించుకున్నాడు. ఒక నెలలోనే తన వ్యాపారాలన్నీ ఎందుకు ఇంత నష్టాలపాలవుతున్నాయో అర్థం కావటల్లేదన్నాడు. ఆ సాధువు కళ్ళు మూసుకుని ధ్యానించి ఏదో స్ఫురించినవాడై గోవాంకర్‌తో ఇలా అన్నాడు. నాయనా! నెలరోజుల క్రితం నీ గొర్రె ఒకటి తప్పిపోయినప్పుడు నీ దగ్గర పనిచేసే బీరప్పని ఎంతో హింసించావు. అకారణంగా అతనిని పనిలోనుంచి తీసేశావు. అటుతరువాత రెండురోజులకే నీ గొర్రె నీకు దొరికింది. అయినా ఈ సంగతి నువ్వు ఎవరికీ చెప్పలేదు. బీరప్పకి సాయినాథుడంటే ఎంతో ప్రేమ, ఎంతో భక్తి. బీరప్పను అలా హింసించినందుకు సాయనాథునికి నీపై కోపం వచ్చింది. అందువలననే ఇలా జరిగింది. నువ్వు తక్షణం ఆ బీరప్పని పనిలోకి తీసుకో. నీ సమస్యలన్నీ తొలగిపోతాయి అని అన్నాడు.

ఈ మాటలు విన్న గోవాంకర్ ఆశ్చర్యపోయాడు. గొర్రె మళ్ళీ దొరికిన సంగతి తనకు తప్ప ఎవరికీ తెలియదు. ఈ సాధువు చాలా మహిమలు గలవాడిలా ఉన్నాడు అని తలచాడు. ఇంటికి వెళ్ళి సాయినాథుని ఫోటోవద్ద నుంచుని సాయి భక్తుని నిందించినందుకు క్షమించమని చెంపలు వేసుకున్నాడు. బీరప్పకు కబురు పంపి అతడికి తిరిగి నౌకరీలోకి తీసుకున్నాడు. అంతేకాదు అతని జీతం రెట్టింపు చేశాడు. అప్పటినుంచి గోవాంకర్ చక్కటి జీవితాన్ని గడుపుతూ నలుగురికీ సేవ చేస్తూ జీవించినంత కాలం సాయినాథుని సేవిస్తూ చివరన ఆ సాయిలోనే ఐక్యమైనాడు.

శ్రీ సాయినాథునికి తన భక్తులంటే ఎంతో ప్రేమ. ఎంతో అనురాగం. ఎవరైతే సన్మార్గంలో జీవిస్తూ ఎల్లప్పుడూ తననే తలుస్తూ ఉంటారో వారిని నిత్యం రక్షించే అమృతమూర్తి సాయినాథుడు. శ్రీ సాయినాథునిచే తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి అనే భక్తునకు అనుగ్రహింపబడిన ఈ వ్రతం ఆచరించినవారికి ఎన్నో శుభాలు జరుగుతాయి. తలపెట్టిన పనులన్నింటిలోనూ జయం కలుగుతుంది. సాక్షాత్తూ శ్రీ సాయినాథుడే తన భక్తులకోసం అనుగ్రహించిన ఈ వ్రతం నిత్యం ఆచరించేవారికి జీవితం శుభప్రదంగా గడుస్తుంది.

అయిదవ అధ్యాయము సమాప్తము

ఓం సమర్థ సద్గురు సాయినాథాయ నమః
ఓం శ్రీ సాయినాథాయ నమః
ఓం శ్రీ సాయిదేవాయ నమః

# శ్రీ సాయిబాబా అష్టకం

1. పత్రీగ్రామ సముద్భూతం ద్వారకామాయి వాసినం
భక్తాభీష్ట ప్రదం దేవం సాయినాథం నమామ్యహం ॥

2. మహోన్నత కులేజాతం క్షీరాంబుధి సముశుభే
ద్విజరాజం తమోఘ్నం తం సాయినాథం నమామ్యహం ॥

3. జగ దుద్ధారణార్థం యో నరరూప ధరో విభుః
యోగినంచ మహాత్మానం సాయినాథం నమామి తం ॥

4. సాక్షాత్ కారంచమో లేభే స్వాత్మారామోరోర్ ముఖాత్
నిర్మమం మమగాత్రంచ సాయినాథం నమామ్యహం ॥

5. యస్యదర్శన మాత్రేణ నశ్యంతి వ్యాధి కోటయః
సర్వే పాపాః ప్రణశ్యంతి సాయినాథం నమామి తం ॥

6. నరసింహాది శిష్యాణాం దదౌ యోనుగ్రహం గురు
భవబంధాని హర్తారం సాయినాథం నమామ్యహం ॥

7. ధనధాన్యాన్ దరిద్రాన్యాంఔ సమదృష్టేన పశ్యతి
కరుణా సాగరం దేవం సాయినాథం నమామి తం॥

8. నమాదిస్థో పియో భక్తావనతీర్దార్థ దానతః
అచింత్య మహిమానంతం సాయినాథం నమామి తం ॥

ఇతి సాయిబాబా అష్టకం సంపూర్ణం

# శ్రీ సాయి మంగళ హారతి

స్వామి సాయినాథాయ శిరిడీ క్షేత్రవాసాయ
మామాకాభీష్టదాయ మహిత మంగళం ॥స్వామి॥

లోకనాథాయ భక్తలోక సంరక్షకాయ
నాగలోక స్తుత్యాయ నవ్యమంగళం ॥స్వామి॥

భక్తబృంద వందితాయ బ్రహ్మస్వరూపాయ
ముక్తిమార్గబోధకాయ పూజ్యమంగళం ॥స్వామి॥

సత్యతత్త్వ బోధకాయ సాధువేషాయతే
నిత్యమంగళదాయకాయ నిత్యమంగళం ॥స్వామి॥



ఓం శ్రీ అనంతకోటి అఖండ బ్రహ్మాండ నాయక

రాజాధిరాజ యోగిరాజ పరబ్రహ్మ

శ్రీ సచ్చిదానంద సమర్థ సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీజై

ఓం సాయి శ్రీ సాయి జయజయసాయి



సదాకల్పవృక్షస్య తస్యాధి మూలే,
భవద్భావబుద్ధ్యా సపర్యాది సేవాం
నృణాం కుర్వతాం భక్తి ముక్తి ప్రదంతం
నమామీశ్వరం సద్గురుం సాయినాథం!